కాలనీల్లో ఓయో, కో లివింగ్ హాస్టళ్లు నిర్వహించొద్దు..

• రోడ్డెక్కిన గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీవాసులు

నిరసన చేపట్టిన టీఎన్‌జీవో కాలనీవాసులు

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): తమ కాలనీల్లో ఓయో,కో లివింగ్ హాస్టళ్లు నిర్వహించొద్దని గచ్చిబౌలిలోని టీఎన్జీవో కాలనీవాసులు నిరసనకు దిగారు. ఫ్యామిలీలు ఉండే కాలనీల్లో పాశ్చాత్య సంస్కృతిని పెంపొందిస్తూ, పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న హాస్టళ్లకు కాలనీ వాసులు ఇండ్లను అద్దెకు ఇవ్వడం సరికాదని తెలిపారు. కాలనీలోని కో లివిన్‌లో ఉండే యువతీ యువకులు ఇష్టారీతిన ప్రవర్తిస్తుండటంతో సొసైటీలు, రెసిడెంట్స్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు మంచి వాతావరణంలో పెరగాలంటే ఫ్యామిలీలు ఉండే కాలనీల్లో కో లివింగ్, ఓయోలకు ఇండ్లు అద్దెకు ఇవ్వొద్దని కోరారు. ఇలాగే ఓయో, కో లివిన్‌లను ఏర్పాటు చేసుకుంటూ పోతే భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎన్‌జీవో కాలనీలోని ఓయో, కో లివిన్ హాస్టళ్లను తొలగించేదాకా నిరసనలు కొనసాగిస్తామన్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి ఇండ్లను ఫ్యామిలీలకు అద్దెకివ్వాలని కోరారు.

మహిళా ప్రొఫెసర్ డిజిటల్ అరెస్ట్!

• రూ. 67 లక్షలు లూటీ చేసిన సైబర్ నేరగాళ్లు
• నెలరోజులకుపైగా వాట్సాప్‌లో రోజువారి అటెండెన్స్
• తగ్గుతున్నాయనుకుంటే తిరిగి ప్రారంభం
• కేసు దర్యాప్తు చేపట్టిన రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): తగ్గుముఖం పడుతున్నాయనుకుంటే.. కొద్ది విరామం ఇచ్చి తిరిగి డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో సైబర్ నేరగాళ్లు ఉన్నత పోస్టుల్లో ఉన్న వారిని, రిటైర్డు ఉద్యోగులను బెదిరిస్తూ పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేస్తున్నారు. తాజాగా ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన మహిళా ప్రొఫెసర్‌ను నెలకుపైగా సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్‌తో బెదిరిస్తూ రూ. 67 లక్షలు సైబర్ లూటీ చేశారు. డిజిటల్ అటెండన్స్ తీసుకుంటూ నకిలీ పోలీసులు రోజుల తరబడి వేధిస్తూ డబ్బులు వసూ లు చేశారు. రాచకొండలో నమోదైన ఈ డిజిటల్ అరెస్ట్ కేసు వివరాలు ఇలా ఉన్నాయి..

మేడిపల్లిలో నివాసం ఉంటున్న బాధితురాలు ఓయూలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 7న టెలికమ్యూనికేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. మీపై మహారాష్ట్ర హైకోర్టులో కేసు నమోదైందని, అక్రమ కార్యకలాపాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు ఫలానా మొబైల్ నంబర్ నుంచి పంపించారని, ఆ మొబైల్ నంబర్ ముంబయి అందేరీలో షాప్ నంబర్ 5లో మీ ఆధార్ వివరాలతో ఢిల్లీకి చెందిన మనీషా అనే పేరుతో తీసుకున్నారని వివరించారు. మీరు ముంబయి పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. తాను హైదరాబాద్‌లో ఉన్నానని, తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బాధితురాలు చెప్పినా మీ ఆధార్ పంపించండి మీరు ఒంటరిగా ఉండి వీడియో కాల్ చేసి మీ మొబైల్ నంబర్ స్క్రీన్ షేర్ చేయండంటూ సూచించారు. మీ కేసు మూసేసే ముందు సైబర్‌క్రైమ్‌కు సంబంధించిన కేసులను పరిశీలిస్తామంటూ చెబుతూ దీపాక బర్మాకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులోనూ మీకు సంబంధముందని, మీ ఆధార్‌తో బ్యాంకు ఖాతా ఓపెన్ అయ్యిందని జాతీయ భద్రతకు సంబంధించిన అంశంతో ముడిపడి ఉందంటూ భయపెట్టించారు. ఇలా ఫిబ్రవరి 7తేదీ నుంచి మూడు రోజుల పాటు వీడియో కాల్స్ మాట్లాడారు. మీపై కోర్టు అర్డర్ ఉందని, డీసీపీ అజయ్‌కుమార్ పాటిల్ ఎదుట మీరు హాజరుకావాలంటూ ఆయనతో వీడియో కాల్స్ మాట్లాడారు. ఈ విషయం ఎవరితోనూ చెప్పకూడదని మీపై విచారణ జరుగుతుందని ప్రతి రోజూ 7 గంటలకు మీరు వీడియో కాల్‌లో నా ముందు హాజరుకావాలని, ఉదయం 9 గంటలకు వాట్సాప్‌లో మీరు అటెండన్స్ పంపించాలంటూ షరతు విధించారు. ఫిబ్రవరి 10న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీడియో కాల్‌లో విచారణ పేరుతో బెదిరించారు. సీబీఐ లోగోలు వెనుక పెట్టుకొని వీడియో కాల్స్‌లో సైబర్‌నేరగాళ్లు విచారిస్తూ నెమ్మదిగా డబ్బులు వసూలు చేయడం ప్రారంభించారు. సుప్రీంకోర్టు అర్డర్ ఉందని మీరు రూ. 60 లక్షలు చెల్లించాలని, విచారణ తరువాత తిరిగి మీ ఖాతాలోకి బదిలీ అవుతాయంటూ నమ్మించారు. మీరు ఈ డబ్బు చెల్లిస్తే మార్చి 1వ తేదీ వరకు కేసు క్లోజ్ అవుతుందని నమ్మించారు. ఇలా మార్చి 20వ తేదీ వరకు కేసు విచారణ పేరుతో రూ. 67 లక్షలు సైబర్ నేరగాళ్లు బాధితురాలి వద్ద కాజేశారు. తనలోనే ఈ విషయాన్ని దాచుకొని భయపడుతున్న ఆమె తన తోటి ఉద్యోగి, బ్యాంక్ మేనేజర్లతో ఈ విషయాన్ని చర్చించడంతో ఇదంతా మోసమని పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. ఆమె ఫిర్యాదుతో రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇప్పటికే డిజిటల్ అరెస్ట్‌లపై రాచకొండ పోలీసులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిజమైన పోలీసులు ఎవరూ డబ్బులు అడగరు.. మనీలాండరింగ్, డ్రగ్స్, అక్రమ లావాదేవీలు చేశారంటూ.. ఆరోపణలు చేస్తూ ఆధార్, ప్యాన్ వివరాలు తీసుకోవడం, వాటి గురించి ఆరా తీసి కేసు మాఫీ చేయాలంటే డబ్బులు చెల్లించాలంటూ మాయమాటలు చెబుతుంటారు.. అలాంటి మాటలు నమ్మొద్దంటూ ప్రచారం చేస్తున్నారు. మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

నగరంలో రూ.8లక్షల విలువజేసే డ్రగ్స్ పట్టివేత

• 203 గ్రాముల ఓజీ కుష్ సీజ్.. ఇద్దరి అరెస్ట్

నిందితుడిని పట్టుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): విదేశాల్లో సాగుచేసే ఖరీదైన ఓజి కుష్ అనే మత్తు పదార్థాన్ని నగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో హైదరాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8లక్షల విలువైన ఓజి కుష్ అనే విదేశీ గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మహేష్ కథనం ప్రకారం... నగరానికి చెందిన ఎ.నరేందర్‌కుమార్ డార్క్ వెబ్‌సైట్ ద్వారా విదేశాల నుంచి ఓజీ కుష్ అనే మత్తు పదార్థాన్ని తెప్పించి, నగరంలో విక్రయిస్తున్నాడు. గ్రామకు రూ.4వేల నుంచి రూ.6వేల చొప్పున కొందరు సంపన్న వర్గాల వారికి ఈ మత్తుపదార్థాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మహేశ్ తన బృందంతో కలిసి నాంపల్లిలోని నరేందర్ నివాసంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 102 గ్రాముల ఓజీ కుష్ అనే ఖరీదైన విదేశీ గంజాయి లభించింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును నాంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

అమీర్‌పేటలో...

మరో కేసులో నగరానికి చెందిన చల్లా శ్రీనిధి అనే వ్యక్తి డార్క్‌వెబ్‌సైట్ ద్వారా ఓజీ కుష్‌ను ఆర్డర్ చేస్తాడు. అక్రమంలో కొనుగోలు చేసిన విదేశీ మత్తు పదార్థాన్ని పరిచయమున్న వారికి గ్రాము రూ. 5 వేలు చొప్పున విక్రయిస్తాడు. సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అమీర్‌పేటలోని శ్రీనిధి నివాసంపై దాడులు జరిపారు. దాడుల్లో 101 గ్రాముల ఓజీ కుష్ లభించడంతో శ్రీనిధిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 101గ్రాముల ఓజీకుష్, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ అనీల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఓజీ కుష్‌ను పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మహేశ్, ఎస్ఐ వరదభూపాల్, కానిస్టేబుల్ వంశీ, పవన్, కృష్ణ, వినీత్,ఉపేందర్‌ను ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

సరస్వతిగూడలో వ్యక్తి హత్య

కందుకూరు, మార్చి 23 : ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సీతారామ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సరస్వతిగూడ గ్రామానికి చెందిన మొలగాసి సుధాకర్(34) అదే గ్రామానికి చెందిన శమంత, అలియాస్ శశికళకు కొన్ని రోజుల కిందట అప్పుగా డబ్బులు ఇచ్చాడు. అవసరం నిమిత్తం సుధాకర్ శనివారం మధ్యా హ్నం శమంత ఇంటికి వెళ్లి అప్పుగా ఇచ్చిన డబ్బులను అడిగాడు. అదే సమయంలో అక్కడే ఉన్న ఆమె తమ్ముళ్లు మధుర మోని శేఖర్,వినయ్,సుధాకర్‌తో ఘర్షణ పడ్డారు. ఈ విషయంలో శమంత, సుధాకర్‌పై కందుకూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న సుధాకర్ తాను కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి తన తల్లి వసంతను బైక్‌పై ఎక్కించుకొని లేమూరు గ్రామం మీదుగా కందుకూరు వైపు వస్తుండగా.. మధ్యాహ్నం జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని సుధాకర్‌ను హత్య చేయాలని నిర్ణయించుకొని లేమూరు గ్రామం దాటగానే శేఖర్, వినయ్ లు, సుధాకర్ వాహనానికి అడ్డు వచ్చి అత డిని కింద పడేసి కర్రలు,రాళ్లతో దాడి చేశారు. అతని ముఖంతో పాటు శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. మృతి చెందాడని అనుకొని వెళ్లిపోయారు. తర్వాత అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా, తల్లి వసంతపై కూడా రాళ్ల దాడి చేయడంతో ఆమెకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సుధాకర్ తమ్ముడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు చేసుకొని శవ పంచనామా నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేరోజు 389 మంది మందుబాబుల పట్టివేత

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 389మంది వాహనదారులను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. శనివారం ఒక్క రోజే నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 389 మంది వాహనదారుల్లో 315 మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. కాగా, 13 మంది త్రిచక్ర వాహనదారులు, 59మంది నాలుగు చక్రాల వాహనదారులు, ఇద్దరు భారీ వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బ్లడ్ ఆల్కహాల్ కాన్సంట్రేషన్(బీఏసీ) రేంజ్ 200ఎంజి/100ఎంఎల్ నుంచి 500 ఎంజి మధ్య 26మంది ఉన్నారని, బీఏసీ రేంజ్ 500ఎంజిల కంటే ఎక్కువగా ఉన్న వారు 11 మంది ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు పట్టుబడిన వాహనదారులందరినీ న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమై, ఇతరుల ప్రాణాలు తీస్తే వారిపై బీఎన్ఎస్ 2023 చట్టం, 105సెక్షన్ కింద 10 ఏండ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధిస్తారని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కాశీ యాత్రలో తీవ్ర విషాదం

తిరుగు ప్రయాణంలో బస్సు బోల్తా.. ఒకరి మృతి, 11 మందికి తీవ్రగాయాలు

మృతురాలు మల్లమ్మ (ఫైల్)

మూసాపేట, మార్చి 23: అల్లాపూర్ నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన 12 మంది యాత్రికులు తిరుగు ప్రయాణంలో బస్సు లోయలో పడటంతో ఒకరు మృతి చెందగా, 11 మంది గాయాలపాలయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణికుల బంధువులు తెలిపిన ప్రకారం... అల్లాపూర్ డివిజన్ పరిధి రామారావు నగర్‌కు చెందిన మల్లమ్మ(50) తన బంధువులు 11 మంది తో కలిసి ఈనెల 16న కాశీ యాత్రకు ట్రైన్ లో బయలుదేరారు. యాత్ర ముగించుకుని ఈనెల 21న బస్సులో నగరానికి తిరుగు ప్రయాణమయ్యారు. శనివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో నాగపూర్ సమీపంలో ఘాట్ రోడ్డు మూలమలుపు వద్ద బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మల్లమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మల్లమ్మ రామారావునగర్‌లో స్క్రాప్ దుకాణం నిర్వహిస్తుంటుంది. ఈమెకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మల్లమ్మకు తోడుగా స్క్రాప్ దుకాణంలో పనిచేస్తుంటాడు. చిన్న కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. మల్లమ్మ మృతి వార్త తెలియడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాగపూర్‌లోని అధికారులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యంతోపాటు మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

లిఫ్ట్ గుంతలో పడి కార్మికుడి మృతి

దుండిగల్, మార్చి 23: బిల్డర్ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. లిఫ్ట్ చుట్టూ ఎటువంటి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనం ఐదో అంతస్తు పై నుంచి లిఫ్ట్ గుంతలో పడిన సెంట్రింగ్ కార్మికుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, లలిత్‌పూర్ జిల్లాకు చెందిన రాంపాల్ కుసువహ (25) అనే యువకుడు ఉపాధికోసం గత నాలుగు నెలల కిందట నగరంలోని బోరబండలో నివాసముంటున్న సోదరుడి వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేటలోని సింహపురి కాలనీ, లహరి గ్రీన్ పార్క్ రోడ్‌లో నిర్మాణంలో ఉన్న (ప్లాట్ నంబర్ 466) బహుళ అంతస్తుల భవనంలో గత కొన్ని రోజులుగా సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి పడుకునేందుకు భవనం ఐదవ అంతస్తుకు వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు లిఫ్టు గుంతలో పడ్డాడు. దీంతో రాంపాల్ తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో పాటు లిఫ్ట్ గుంతలో నీరు ఉండటంతో ఊపిరాడక అందులోనే చనిపోయాడు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో రోజు మాదిరిగా పనికి వచ్చిన కార్మికులు రాంపాల్ మృతదేహం లిఫ్ట్ గుంతలో పడి ఉండటం చూసి అతడి సోదరుడికి సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే బిల్డర్ నిర్ల క్ష్యం వల్లే ఈ మరణం సంభవించినట్లు పోలీసులు పేర్కొన్నారు. లిఫ్ట్ చుట్టూ ఎటువంటి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో రాంపాల్ అందులో పడి మృతి చెందినట్లు, పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీజిల్ ట్యాంకర్‌లో మంటలు

మూసాపేట, మార్చి 23: నిర్మానుష్య ప్రదేశంలో పార్క్ చేసిన వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఐడీఎల్ చెరువు సమీపంలో ప్రైవేట్ బస్సు పార్కింగ్ ఉన్నది. అందులో బస్సులతో పాటు ట్యాంకర్ పార్క్ చేసి ఉన్నది. ట్యాంకర్‌లో మిగిలిపోయిన డీజిల్ తీసే క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డీజిల్ ట్యాంకర్‌తోపాటు పక్కనున్న కారుకు సైతం మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి, కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐపీఎల్ బ్లాక్ టికెట్ల విక్రయాలపై నిఘా

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): ఐపీఎల్‌లో బ్లాక్ టికెట్లు అమ్మేవారిపై రాచకొండ పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. క్రికెట్ మ్యాచ్‌కు టికెట్లు ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేయాలని, ఉప్పల్‌లోని క్రికెట్ స్టేడియం వద్ద టికెట్లు దొరుకుతాయనే భావనతో వచ్చి ఇబ్బందులు పడవద్దంటూ క్రికెట్ అభిమానులకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచనలు చేశారు. బ్లాక్‌లో టికెట్ల విక్రయాలు జరగకుండా నిఘాను కట్టుదిట్టం చేయాలంటూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో శని, ఆదివారాలలో ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో ఎస్ఓటీ పోలీసులు నిఘాను పెట్టారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొని, స్టేడియం వద్ద బ్లాక్ టికెట్లు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న భరద్వాజ్ వద్ద నాలుగు, సంపత్, హరి వద్ద ఐదు టికెట్లను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకొని, వారిని తుదుపరి విచారణ నిమిత్తం ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసి స్టేడియం వద్ద బ్లాక్‌లో టికెట్లు విక్రయించే వారిని గుర్తిస్తూ ఎస్ఓటీ పోలీసులు నిఘాను పటిష్టం చేస్తున్నారు.

నకిలీ సిగరెట్ల పట్టివేత

కార్వాన్, మార్చి 23: నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న ఓ నిందితుడిని టప్పాచబుత్రా పోలీసులు అరెస్టు చేసి నిందితుడి నుంచి నకిలీ సరుకుతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్స్పెక్టర్ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. జిర్రా ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ ఖాద్రి(28) బెంగళూరు నుంచి ఐటీసీ కంపెనీకి చెందిన దాదాపు రూ.16,80,000 విలువైన గోల్డ్ ఫ్లాగ్ నకిలీ సిగరెట్లను తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు టప్పాచబుత్రా ఇన్స్పెక్టర్ రాములు నేతృత్వంలో పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ నకిలీ సరుకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నార్సింగి ఓఆర్ఆర్‌పై కారు బీభత్సం

• క్యాబ్ డ్రైవర్ మృతి.. మరో ఐదుగురికి తీవ్రగాయాలు

మణికొండ,మార్చి 23: మితిమీరిన వేగంతో డివైడర్‌ను ఢీకొట్టి.. పల్టీలు కొడు తూ ఇవతల రోడ్డుపైకి దూసుకొచ్చి కారును ఢీకొట్టడంతో క్యాబ్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఆనంద్ కాంబ్లే అనే క్యాబ్ డ్రైవర్ శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తుండగా.. అవతలిరోడ్డులో వెళ్తున్న మరో కారు అతివేగంగా వచ్చి పల్టీలు కొట్టుకుంటూ క్యాబ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్యాబ్‌డ్రైవర్ మృతి చెందగా కారు నుజ్జునుజ్జయింది. క్యాబ్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన వారిని దవాఖానకు తరలించారు. అతి వేగంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న టాటా జైలోకారు నార్సింగి వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిందని పేర్కొన్నారు. నార్సింగ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య

• ఎల్బీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

మృతుడు బొడ్డు మహేశ్(ఫైల్)

మీడియా ఎదుట రోధిస్తున్న మృతుడి తల్లి, సోదరి

మన్సూరాబాద్, మార్చి 23: ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి శివగంగ కాలనీలో పాత నేరస్తుడైన ఓ వ్యక్తి అర్ధరాత్రి దారుణహత్యకు గురయ్యాడు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు, మృ తుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, భరత్‌నగర్‌కు చెందిన బొడ్డు మహేశ్(31) ప్రస్తుతం ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మహేశ్‌కు భార్య, కూతురు ఉన్నట్లు సమాచారం. బొడ్డు మహేశ్‌కు పురుషోత్తం, సందీప్, రాము, నాగార్జునతో పాటు మరికొందరితో స్నేహం ఉన్నది. స్నేహితులైనప్పటికీ మహేశ్, పురుషోత్తం వేర్వేరుగా గ్యాంగ్‌లు నడుపుతున్నారు. కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. రెండేండ్ల క్రితం తట్టి అన్నారంలోని ఓ బార్‌లో మద్యం సేవించిన మహేశ్, పురుషోత్తం గొడవ పడ్డారు. పురుషోత్తం బీరు బాటిల్‌తో మహేశ్ తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. ఈ విషయమై హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నాటి నుంచి బొడ్డు మహేశ్, పురుషోత్తం మధ్య కక్షలు పెరిగాయి. తనపై దాడికి పాల్పడిన పురుషోత్తంపై మహేశ్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ క్లినిక్ వద్ద ఉన్న పురుషోత్తంతో పాటు మరో వ్యక్తిపై బొడ్డు మహేశ్ దాడికి పాల్పడ్డాడు. పురుషోత్తం అతడి మిత్రుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. దాడికి పాల్పడిన బొడ్డు మహేశ్‌ను చైతన్యపురి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. 20 రోజుల కిందట బొడ్డు మహేశ్ జైలు నుంచి విడుదలయ్యాడు. అయితే మహేశ్ బతికి ఉంటే తనకు ప్రాణహాని ఉంటుందని భావించిన పురుషోత్తం అతడి మిత్రులు.. ఎలాగైనా మహేశ్‌ను అంతమొందించాలని పథకం వేసుకున్నారు. అందులోభాగంగా మూడు రోజుల నుంచి మహేశ్‌ను వెంబడిస్తూ అదను కోసం చూస్తున్నారు.

శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో బొడ్డు మహేశ్ తన స్నేహితుడితో కలిసి హోండా యాక్టివాపై ఆర్టీసీ కాలనీ నుంచి శివగంగ కాలనీ వైపునకు వెళ్తున్నాడు. అప్పటికే ఆ ప్రాంతంలో మాటువేసి ఉన్న పురుషోత్తం గ్యాంగ్ మహేశ్ శివగంగ కాలనీ వద్దకు రాగానే వెనుక నుంచి కారుతో బైక్‌ను ఢీకొట్టారు. బైక్ పైనుంచి మహేశ్ కింద పడిపోగానే కారులో ఉన్న పురుషోత్తం, నాగార్జున, రాము, సందీప్ ఒక్క ఉదుటున కిందికి దిగారు. పరుగెత్తుతున్న మహేశ్‌ను వెంబడించి గొడ్డలి, కత్తులు, కొడవళ్లతో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న మహేశ్‌ను ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మహేశ్‌ను హతమార్చిన అనంతరం నిందితులు పురుషోత్తం, సందీప్, నాగార్జున, రాము పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. హత్యలో మరికొందరు పాల్గొన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులు నలుగురిని ఓ రహస్య ప్రదేశంలో ఉంచి పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

బొడ్డు మహేశ్‌ను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుడి సోదరి మౌనిక ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మృతుడి సోదరి మౌనిక, అతడి తల్లి విలేకరులతో మాట్లాడుతూ మహేశ్ హత్య వెనుక పురుషోత్తం బావతో పాటు ఆర్కేపురం డివిజన్ అల్కాపురి ప్రాంతానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందని వారు ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

మృతిచెందిన జాన్సన్(ఫైల్)

కొండాపూర్, మార్చి 23 : వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన